# *కళా తపస్వి

**"త**న వ్యక్తిత్వాన్ని దిగమింగి అహంని జయించటంలోనే కళాకారుడి పురోగమనం ఉందన్న సూత్రాన్ని నేను స్వీకరిస్తాను" అన్నాడు బుచ్చిబాబు. తన 'అంతరంగ కథనాన్ని' ముగిస్తూ. ఆ మాటని అక్షరాల జీవించిన కళాకారుడు బుచ్చిబాబు.

బుచ్చిబాబుకి ఆధునిక తెలుగు సాహిత్యంలో వొక విశిష్టమైన స్థానం ఉంటుంది.

బుచ్చిబాబు చాలా సాహితీ ప్రక్రియల్లో కృషిచేసినా, ఆయన ప్రథమంగా కథకుడు. తెలుగు కథానికను మళ్ళా మళ్ళా చదివించే వొక ఖండకావ్యంలా రూపకల్పన చేసిన కథకుడు బుచ్చిబాబు. ఆయన కథల్లో గొప్ప కవితావేశం, కళాపటిమ, సౌందర్య దృష్టి, మనోవిశ్లేషణ గోచరిస్తాయి. ఆయన కథలన్నింటిలోను వస్తువు – మానవుడి అంతరంగం. చాలామంది కథకులు మనిషిని బాహ్యంగా మాత్రమే చూపిస్తారు – బుచ్చిబాబు తనకథల్లో మనిషి అంతరంగాన్ని వివిధ రూపాల్లో చిత్రిస్తాడు. ఆధునిక నాగరికతలో పూర్తిగా లౌకిక విలువలకి లొంగిపోతున్న మానవుడిలో ఎక్కడో అణిగిమణిగి ఉన్న కళాతృష్ణ, అలౌకిక విలువలు ఒకానొక సన్నివేశంలో ఉప్పొంగి బయటపడటం ఆయన కథల్లో చూస్తాము ఆయన వ్రాసిన "మేడ మెట్లు" "ఎల్లోరాలో యేకాంత సేవ" "నిరంతరత్రయం" "అరకు లోయలో కూలిన శిఖరం" "నన్ను గూర్చి కథ వ్రాయవూ" "బి" "తడిమంటకి పొడి నీళ్ళు" మొదలయిన కథలు తెలుగు పాఠకుల్ని యుగయుగాల వరకు ఉర్రూత లూగించగల గొప్ప ఖండకావ్యాలు.

ఆయన వ్రాసిన యేకైక నవల "చివరకు మిగిలేది" తెలుగు నవలా సాహిత్యంలో చరిత్రను సృష్టించిన నవల అది. నవల కాల్పనికోద్యమం నుండి బయటపడి నిజమైన ఆధునికతను సాధించటం – "చివరకు మిగిలేది"తో ప్రారంభమైంది. ఈ నవలలో బుచ్చిబాబు సృష్టించిన పాత్రలు – దయానిధి, కోమలి, అమృతం – తెలుగువాళ్ళ కలల్ని, కన్నీళ్ళని, గాథల్ని, బాధల్ని శాశ్వతంగా పంచుకుంటారు. కలకాలం తరిగిపోని సౌందర్యంతో విలసిల్లే వొక కళాఖండం "చివరకు మిగిలేది."

రచనల్లోనే కాదు – నిత్యజీవితంలోను – నిజమైన కళోపాసకుడుగా, సంపూర్ణ మానవుడుగా, స్నేహవత్సలుడుగా జీవించిన గొప్ప కళా తపస్వి బుచ్చిబాబు. నడివయస్సులోనే ఆయన మనకి దూరమైనా సాహితీ లోకంలో బుచ్చిబాబు అమరుడు.

**(సృజన – మాసపత్రికలో ప్రచురించిన వ్యాసం ఆధారంగా)**

---

* ఈ కళా తపస్వి "తీర్పుచేసిన వాడికే శిక్ష", "నన్ను గురించి కథ వ్రాయవూ?", "కలలో జారిన కన్నీరు"లలో కూడా వుంది. గమనించగలరు.